క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని డీఆర్డీఏ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని టౌన్‌హాల్ ఏఈ సుధాకర్ శనివారం తెలిపారు. ట్రంకురోడ్డు, కాపువీధి, ఆనంవారివీధి, బృందావనం, సుబేదారుపేట, సండే మార్కెట్, పొగతోట పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుతాం



నెల్లూరు రూరల్: జిల్లాలోని వక్ఫ్‌బోర్డు ఆస్తులను కాపాడుతామని వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మీరా పేర్కొన్నారు. నగరంలోని పెద్ద బజారులోని అబ్బాసలీంఖాన్ మసీదుకు చెందిన విలువైన స్థలం అన్యాక్రాంతంపై కోర్టులో వ్యవహారం నడుస్తోంది. ఈ క్రమంలో ఆ స్థలం వక్ఫ్‌బోర్డుదేనని కోర్టు తీర్పు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం వక్ఫ్‌బోర్డు సభ్యులు, మైనార్టీ నాయకులు అక్కడికి చేరుకుని హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు ఆస్తులను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, పలువురు కార్పొరేటర్లు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

వేగంగా రథం పనులు



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించి శ్రీవా రథం పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.40 లక్షల వ్యయంతో దేవస్థానం నిర్వాహక కమిటీ సభ్యులు రథాన్ని తయారు చేయిస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి రథం తయారీకి సహకారం అందిస్తుండడంతో పాటు పలాస టేకుకు అయ్యే ఖర్చును భరిస్తున్నారు. త్వరలో రథం తయారీ పనులు పూర్తి చేస్తామని కమిటీ వెల్లడించింది.

పోలింగ్ కేంద్రం పరిశీలన



కోవూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తహసీల్దార్ పద్మజ మాట్లాడుతూ బాలికోన్నత పాఠశాల ఆవరణలో పట్టభద్రుల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయుల కోసం ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. కోవూరు నియోజకవర్గం పరిధిలో పట్టభద్రుల ఓటర్ల కోసం 14, ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఐదు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వారికి అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. వారి వెంట కోవూరు సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, ఆర్ఐ రమణయ్య, సీనియర్ సహాయకుడు మధు తదితరులు ఉన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ



కోవూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో స్మాష్ రాకెట్ జిల్లా జట్టు క్రీడాకారులకు కోవూరు ఎంపీపీ తుమ్మల పెంట పార్వతి సొంత నిధులతో క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు కవరగిరి శ్రీలత, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ దేవిక, ఉపాధ్యాయులు గీతా మాధురి తదితరులు ఉన్నారు .

విద్యతోనే అభివృద్ధి



మనుబోలు : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని ఎస్సై ముత్యాలరావు అన్నారు. మనుబోలులోని ఎస్సీ బాలికల వసతిగృహంలోని విద్యార్థులకు పద్మావతి సూపర్‌మార్కెట్ అధినేత యనమల అంకయ్య ఎస్సై చేతుల మీదుగా శనివారం పరీక్ష సామగ్రి అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు దాతలు ముందుకు రావాలన్నారు. వైద్యాధికారి గేయ పూజిత, హెచ్‌డబ్ల్యూ మహేశ్వరి, ఏఎన్‌ఎం సుభాషిణి, సుధీర్, జగదీష్‌బాబు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తూర్పురాయలసీమ నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరుఫున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బలపరిచిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, వారిని ఆశీర్వదించాలని నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ కోరారు. నగరంలోని విజయమహల్‌గేటు సమీపంలోని ఎంసీఎస్ కల్యాణ మండపంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఓటమి భయంతో ప్రతిపక్షాలు ఏ విధంగా పొత్తులు పెట్టుకుని ఎన్నికల్లో నిలబడుతున్నాయో మనమందరం చూస్తూనే ఉన్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేదంటూ, పరిశ్రమలు తీసుకురావడం లేదంటూ ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నాయని ఆరోపించారు. వారం రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన సమ్మిట్‌లో దేశంలోని పారిశ్రామిక దిగ్గజాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. వారందరూ తమ కంపెనీలను తీసుకొచ్చి లక్షలాది మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పడం జరిగిందన్నారు. చంద్రబాబు తన హయాంలో పరిశ్రమలకు రూ.40వేల కోట్లు కూడా పెట్టుబడుల రూపంలో తీసుకురాలేదని, మన ప్రభుత్వంలో రూ.13లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంజరిగిందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత జగనన్నదేనని, పట్టభద్రులు ఆలోచించి ఆయనకు అండగా నిలబడి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పోలింగ్ సమయం సాయంత్రం 4 గంటలకు ముగుస్తుందని, ఓటర్లు పోలింగ్ సమయాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగా ఓట్లు వేసేందుకు పోలింగ్ బూత్‌లకు రావాలని కోరారు.

అవాస్తవ కథనాలతో శునకానందం

తనపై కొందరు ఎల్లోమీడియాలో అవాస్తవ కథనాలు రాయించి శునకానందం పొందుతున్నారని నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ముక్కాల ద్వారకానాథ్‌కు సంబంధించిన ఫ్లెక్సీలపై స్టిక్కర్లు వేశారన్నారు. ఈ విషయంలో తన ప్రమేయం ఎంతమాత్రం లేకున్నా, తనపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా ఏబీఎన్ ఛానల్ విలేకరి ఓ పథకం ప్రకారం తాయిలాలు తీసుకుని అవాస్తవ కథనాలను ప్రచారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై వచ్చే ఒక్కొక్క కథనానికి రూ.లక్ష వసూలు చేస్తూ ఇప్పటికే ఓ ప్లాట్, పద్మావతి టైల్స్ అందుకున్న సదరు రిపోర్టర్ నుంచి వడ్డీతో సహా ఎలా కక్కించాలో ఆ భగవంతుడే చూసుకుంటాడని అన్నారు. ఏబీఎన్ ఛానల్‌లో వస్తున్న అవాస్తవ కథనాలపై పరువు నష్టం దావా వేస్తున్నామన్నారు. ఎంత దండుకుంటారో దండుకుని 365 రోజులు తనపై అసత్య కథనాలు వేసినా భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయంగా కొట్లాడటం, ఎదుర్కోవడం చేతకాని కొందరు చిల్లర మనుషులు ఏబీఎన్ ఛానల్‌ను అడ్డుపెట్టుకుని చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. రూరల్ నియోజకవర్గ పరిధిలోని టీ దుకాణాల్లో కూర్చుని అబద్ధాలు చెప్పడమే పనిగా కొందరు ఈ విధమైన ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో నగర డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, నగర నియోజకవర్గ కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకట హరచతుర్థి



వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెం, మహాత్మాగాంధీనగర్‌లోని శ్రీకృష్ణమందిరంలో సంకట హరచతుర్థిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీకృష్ణ మందిరంలో కొలువైన శ్రీవరసిద్ధి విజయ వినాయకస్వామికి ప్రధానార్చకుడు బీ శ్రీనివాసాచార్యులు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. ఉభయకర్తలుగా సీహెచ్. కరుణాకర్‌రెడ్డి,మాధురి, ఆర్ రామసుబ్బు, వాసుకి, ఆర్ కనకరాజు,శరణ్య దంపతులు వ్యవహరించారు. మందిర ధర్మకర్త సీ వెంకటేశ్వర్లు, అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు బీవీ రాఘవేంద్ర, ఎస్ సుబ్బరామరాజు, వేణుబాబు, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యాదవ భవన్‌కు భూమి పూజ నేడు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న యాదవ భవన్ ట్రస్ట్ నిర్వాహకులు

నెల్లూరు(వేదాయపాళెం): కొండాయపాళెం, గొలగమూడి రోడ్డులో జిల్లా యాదవ భవన్‌కు భూమిపూజ కార్యక్రమం ఆదివారం ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని యాదవ్ సంఘ నాయకుడు దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్ తెలిపారు. ముత్తుకూరు రోడ్డులోని హోటల్ రాధే గెస్ట్ ఇన్‌లో భూమి పూజ ఆహ్వాన పత్రికలను జిల్లా యాదవ భవన్ ట్రస్ట్ నిర్వాహకులు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా యాదవ సంఘ అధ్యక్షుడు నాగ కిషోర్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో దేవరాల సుబ్రహ్మణ్యం మాట్లాడారు. జిల్లా యాదవ్ భవన్‌లో అధునాతన వసతులతో విద్యార్థుల కోసం 70 వసతి గదులు, కల్యాణ మండపం, సమావేశ మందిరం, వివిధ ఉద్యోగ సంఘాల కార్యకలాపాల కోసం ఆఫీసులు నిర్మించనున్నట్లు వివరించారు. భూమిపూజ మహోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎంపీ బీద మస్తాన్‌రావు, నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్, బీద రవిచంద్రయాదవ్, దూడల సుధాకర్‌యాదవ్, వంకి పెంచలయ్యయాదవ్, పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, పొట్టేళ్ల శిరీష యాదవ్, పీ కృష్ణయ్యయాదవ్, గొల్లపల్లి విజయకుమార్‌యాదవ్, తదితరులు హాజరుకానున్నారని వివరించారు. జిల్లాలోని యాదవులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ట్రస్ట్ నిర్వాహకులు ఆనంగి రమణయ్యయాదవ్, దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, రాయి రమణయ్యయాదవ్, గంగుల మధుసూదన్‌యాదవ్, కంజివరం నాగేంద్రయాదవ్, తదితరులు పాల్గొ న్నారు.

ఎన్నికల నిబంధనలు బేఖాతర్

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నిబంధనలను ఓ బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు బేఖాతర్ చేశారు. బార్ వద్దనే యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగించి జేబులు నింపుకొంటున్నా సంబంధిత అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ పోలింగ్ ప్రక్రియ ముగిసేంత వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లను మూసివేయాలని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. ఈ విషయం తెలుసుకున్న కొందరు బార్ అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు పెద్ద ఎత్తున మద్యాన్ని బయటకు తరలించి నిల్వ చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు శనివారం సాయంత్రం మద్యం దుకాణాలు, బార్‌లకు సీల్‌వేశారు. అప్పటికే మద్యాన్ని బయట నిల్వ చేసుకున్న కొందరు బార్‌ల నిర్వాహకులు నిబంధనలు బేఖాతర్ చేస్తూ గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలకు తెరలేపారు. వెంకటేశ్వరపురం సెంటర్‌లోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద యథేచ్ఛగా మద్యం విక్రయాలు సాగిస్తున్నా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామన్న ఎక్సైజ్ అధికారుల ప్రకటనలు కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయి.

సేవకు ప్రతిరూపం కోసూరు రత్నం



రత్నాన్ని సత్కరిస్తున్న అమరావతి కృష్ణారెడ్డి

నెల్లూరు(బృందావనం): మానవ సేవే మాధవ సేవ అనే మదర్‌థెరిస్సా సందేశాన్ని ఆదర్శంగా తీసుకుని విశాలాక్షి వృద్ధాశ్రమం ద్వారా వృద్ధులకు సేవలందిస్తున్న కోసూరు రత్నం సేవకు ప్రతిరూపమని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఇటీవల కోసూరు రత్నం ఇంటర్నేషనల్ దుబాయ్ ఎక్సెలెన్సీ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ బొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్‌లో 25కళాసంఘాల ఆధ్వర్యంలో కోసూరు రత్నాన్ని శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అమరావతి కృష్ణారెడ్డి మాట్లాడుతూ 120 మంది వృద్ధులకు సేవచేయడంతోపాటు విశాలాక్షి సాహిత్య మాసపత్రిక ద్వారా సాహిత్యసేవ చేస్తున్న కోసూరురత్నం సేవలను గుర్తించి అంతర్జాతీయస్థాయి పురస్కారం అందజేయడం హర్షణీయమన్నారు. గత 19 ఏళ్లుగా దాతల సహకారంతో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న కోసూరు రత్నం సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఈ ఏడాది వైఎస్సార్ లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును సేవా రంగంలో అందజేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో 25 కళాసంఘాల కన్వీనర్లు డీ హరిబాబు, భాస్కర్, సురేంద్రగౌడ్, జిల్లా డ్యాన్స్‌మాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు ఎస్ నారాయణబాబు, సుమంత్, స్టార్ ఈవెంట్స్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అర్జీలను పరిష్కరించండి

నెల్లూరుసిటీ: నగరపాలక సంస్థ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఆన్‌లైన్ సేవల అర్జీలను ఈ నెల 14వ తేదీలోగా పరిష్కరించాలని కమిషనర్ హరిత శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆదేశాల మేరకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి, కుళాయి, డ్రైనేజీ పన్నుల డిమాండ్ నోటీసులు రూపొందించే కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ఈ ప్రక్రియను ఈ నెల 15 నుంచి 31వ తేదీ వరకు చేపడుతున్నందున, ఈ రోజుల్లో కొత్త పన్ను విధించుట, అడిషనల్ ఆల్టరేషన్ వంటి సేవలు ప్రజలకు అందుబాటులో ఉండని తెలిపారు. నగర పాలక సంస్థ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పన్ను వసూళ్ల కేంద్రాల వద్ద ప్రజలకు అన్ని రకాల పన్నులు చెల్లించుటకు అవకాశం ఉందన్నారు. పన్నులు చెల్లింపునకు ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. నగర ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

పేర్నాటిని దీవించండి



నెల్లూరు రూరల్: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పట్టభద్రుల అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరుతూ 32వ డివిజన్‌లో రైల్వే బోర్డు సభ్యుడు స్వర్ణా వెంకయ్య ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. పేర్నాటికి ప్రథమ ప్రాధాన్యతా ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పట్టభద్రులను అభ్యర్థించారు. ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు పాలకీర్తి రవి,నాయకులు ప్రసాద్, రాము, కిషన్, అజమత్, అజాబాయ్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం



నెల్లూరు(టౌన్): తూర్పురాయలసీమ నియోజకవర్గ స్థానానికి జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న బాబురెడ్డి, వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా నాయకులు కోరారు. శనివారం వారు నగరంలోని కళాశాలలకు వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, ఐద్వా జిల్లా కార్యదర్శి మస్తాన్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, అధ్యక్షుడు నరసింహ, ఐద్వా నాయకులు పద్మ, షంషాద్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

30 వరకు గాలికుంటు నివారణకు టీకాలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని పశువులకు ఈ నెల 30వ తేదీ వరకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నామని, పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్థక శాఖ జేడీ మహేశ్వరుడు శనివారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని సుమారు ఐదు లక్షల ఆవులు, గేదెలు, ఎద్దులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిందని తెలిపారు. ఇప్పటికే 25 శాతం పశువులకు టీకాలు వేయడం జరిగిందని, పాడి రైతులు ముందుకొచ్చి మిగిలిన పశువులకు వేయించుకోవాలని కోరారు. ఏప్రిల్ మొదటి వారం నుంచి జిల్లాలోని 14 లక్షల జీవాలకు నట్టల నివారణ టీకాలను ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు.

కలెక్టర్ పరిశీలన



నెల్లూరు(అర్బన్): తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పరిశీలించారు. శనివారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో అధికారులు మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ సమక్షంలో నిర్వహించారు. దీనిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్ల వారీగా సిబ్బంది, మైక్రో అబ్జర్వర్‌ల నియామక వివరాలను డీఆర్వో వెంకటనారాయణమ్మ, ఎన్ఐసీ డీఐఓ సురేష్‌కుమార్ కలెక్టర్‌కు వివరించారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి షఫీమాలిక్, ఎన్ఐసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ, ఖోఖో పోటీలు



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగినులు, పాఠశాలల విద్యార్థినులు, వెటరన్ క్రీడాకారిణులకు ఈ నెల 8 నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. అందులో భాగంగా దర్గామిట్టలోని ఏసీ స్టేడియంలో మహిళా ఉద్యోగులకు కబడ్డీ, ఖోఖో పోటీలను శనివారం నిర్వహించారు. మహిళా ఉద్యోగులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. తొలుత సెట్నల్ సీఈఓ పుల్లయ్య, డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఖోఖో, కబడ్డీ పోటీలకు 110 మంది మహిళలు హాజరవడం సంతోషకరమన్నారు.

వేదగిరిపై విశేష పూజలు



ప్రవచనం చేస్తున్న బాలబ్రహ్మసరస్వతి

నెల్లూరు రూరల్: శ్రీవారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాభిషేకం, తిరుప్పావడ సేవ, ప్రత్యేక పూజలు జరిపారు. నైమి శారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మసరస్వతి ఆలయాన్ని సందర్శించి స్వామి వారి ప్రవచనం చేశారు. తొలుత పీఠాధిపతికి ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అగ్నిగుండ మహోత్సవం



పాండురంగడికి పూజలు చేస్తున్న దృశ్యం



అగ్నిగుండం ప్రవేశం చేస్తున్న భక్తులు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ శివారు, పద్మావతినగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిర ప్రాంగణంలో పాండురంగస్వామి ఆనంద అగ్నిగుండ మహోత్సవాన్ని శుక్రవారం రాత్రి నుంచి శనివారం వేకువజాము వరకు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాండురంగస్వామి పండరి భజన, కోలాట మండల దీక్ష పూర్ణాహుతిని పురస్కరించుకుని లక్ష్మీసాయి గురువు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదూరుపల్లి శీనయ్య గురువు, వారి శిష్యబృందం సహకారంతో నిర్వహించిన అగ్నిగుండ మహోత్సవంలో 500మందికి పైగా భక్తులు పాల్గొని భక్తితత్పరతను చాటారు. జిల్లా తొలి మహిళా పండరి భజన గురువు లక్ష్మీసాయిని వివిధ ప్రాంతాలకు చెందిన పండరిభజనల గురువులు సత్కరించారు. సాయిదర్బార్ అద్దాల మందిరం మేనేజింగ్ ట్రస్టీ, చైర్మన్ మధుసాయి మాట్లాడుతూ సాయినాథుడు, పాండురంగడిని స్మరిస్తూ సాయిదర్బార్ అద్దాలమందిరం ప్రాంగణంలో పండరి భజన నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పండరిభజన గురువులను ఘనంగా సత్కరించారు.

క్రైమ్ కార్నర్

వ్యక్తి అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): పనికి వెళుతున్నాని ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటనపై వేదాయపాళెం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని న్యూమిలటరీకాలనీకి చెందిన వెంకటేశ్వర్లు, మేరీ దంపతులు. వారు ఏడాది క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వెంకటేశ్వర్లు కొండాయపాళెంగేటు సమీపంలోని వాటర్ ప్యూరిఫైర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు. ఈ నెల 6న ఆయన పనికి వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అప్పట్నుంచి ఇంటికి తిరిగి రాలేదు. బాధిత కుటుంబ సభ్యులు అతని కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో వేదాయపాళెం పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు.

వ్యక్తిపై దాడి



నెల్లూరు రూరల్: సౌత్‌మోపూరుకు చెందిన అచ్చి ఈశ్వరయ్యపై అదే గ్రామానికి చెందిన కొందరు శుక్రవారం రాత్రి దాడికి పాల్పడడంతో గాయపడ్డాడు. బాధితుడ్ని స్థానికులు నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వివరాలు..గ్రామానికి చెందిన అచ్చి శ్రీరాములు, రాపూరు ప్రసాద్, అనంతయ్య, రాపూరు గోపాల్‌కు అచ్చి ఈశ్వరయ్యకు ఆర్థిక లావాదేవీల విషయంలో గత కొంత కాలంగా వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి చర్చలకు పిలిచి దాడికి పాల్పడినట్లు బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

నెల్లూరు(క్రైమ్): బాలిక అదృశ్యమైన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన సమాచారం మేరకు.. సంతపేట గోపి టీసెంటర్‌కు చెందిన ఓ బాలిక కాపువీధిలోని ఓ గాజులదుకాణంలో ఎనిమిది నెలలుగా పనిచేస్తోంది. శుక్రవారం ఆమె పనికి వెళ్లలేదు. సాయంత్రం తెలిసిన వారి ఇంటి వరకు వెళ్లొస్తానని తల్లికి చెప్పి బయటకు వెళ్లింది. అక్కడి నుంచి ఆమె అదృశ్యమైంది. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో బాధిత కుటుంబసభ్యులు బాలిక కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయినా ఆమె జాడ తెలియరాలేదు. ఈ మేరకు బాధిత తల్లి సంతపేట పోలీసులకు పిర్యాదు చేశారు.

సెల్‌ఫోన్లు, నగదు చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు చోరీకి పాల్పడ్డాడు. ఈ ఘటన హౌసింగ్‌బోర్డుకాలనీలో శనివారం వేకువన చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. నిప్పోవెనుక హౌసింగ్‌బోర్డుకాలనీలో రామ్‌ప్రసాద్‌శర్మ నివాసం ఉంటున్నారు. శుక్రవారం రాత్రి ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయారు. శనివారం వేకువజామున గుర్తుతెలియని దుండగుడు ఇంటి వెనుకనున్న తలుపును తెరిచిలోనికి ప్రవేశించారు. ఇంట్లో ఉన్న రెండు సెల్‌ఫోన్లు, ప్యాంట్ జేబులోని రూ.15,300నగదు, హ్యాండ్‌బ్యాగ్‌లోని రూ.700 నగదును అపహరించాడు. హ్యాండ్‌బ్యాగును ఇంటిబయట ఉన్న బాత్‌రూమ్‌లో వదిలి పరారయ్యాడు. ఈ మేరకు బాధితుడు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నెల్లూరు(క్రైమ్): క్రేన్ ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడు గాయాలపాలైన ఘటన బీవీనగర్ కృష్ణమందిరం సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది.వివరాలు..మినీబైపాస్‌లోని జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో పీ వెంకటరత్నం నివాసం ఉంటున్నారు. ఆయనకు బీవీనగర్ కృష్ణమందిరం సమీపంలో స్థలం ఉంది. శనివారం రాత్రి దానిని చూసుకుని స్కూటీపై ఇంటికి బయల్దేరారు. అయ్యప్పగుడి నుంచి ఆత్మకూరుబస్టాండు వైపు వెళ్లే క్రేన్ ఆయనను ఢీకొంది. క్షతగాత్రుడ్ని స్థానికులు చికిత్స నిమిత్తం అపోలో ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు సౌత్‌ట్రాఫిక్ పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు. ఎస్సై అబ్దుల్ రహీం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపుతప్పడంతో..

బైక్ అదుపుతప్పి వ్యక్తి గాయపడిన ఘటన ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. వివరాలు..ఉదయగిరికి చెందిన రాజేష్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం ఆయన బంధువులు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆస్పత్రిలో చూపించేందుకు నెల్లూరు వచ్చారు. వారిని ఆస్పత్రిలో చూపించేసరికి రాత్రి అయింది. దీంతో ఆయన మోటార్‌సైకిల్‌పై జనార్దన్‌రెడ్డికాలనీలోని తన అత్త ఇంటికి బయల్దేరారు. ఆత్మకూరు బస్టాండ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద మినీలారీలు ఆపేచోట బైక్ అదుపుతప్పడంతో రోడ్డుపై పడిపోయి తలకు తీవ్రగాయమైంది. గాయాలపాలైన ఆయన నారాయణ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు నార్త్‌ట్రాఫిక్ పోలీసులకు శనివారం సమాచారం అందింది. ఎస్సై గీతారమ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.